

నల్లగొండ మున్సిపల్ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డిని అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు



నల్లగొండ మున్సిపల్ కార్యాలయంలో బీఆర్ఎస్ నాయకులపై దాడికి దిగుతున్న కాంగ్రెస్ నాయకులు

## లోకం పోకడ




మొత్తం కాకపోయినా సగం మాత్రం గ్యారంటీ!

# నల్లగొండలో గూండాగిరీ

మొదటిపేజీ తరువాయి...

ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను మంత్రి కోమటిరెడ్డి, మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస రెడ్డి ఆదేశాలతో మున్సిపల్ సిబ్బంది తొలగించారు. ఈ విషయమై ప్రశ్నించేందుకు మున్సిపల్ కార్యాలయానికి కంచర్ల, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు భోనగిరి దేవేందర్, మాజీ మున్సిపల్ చైర్మన్ సైదిరెడ్డి వెళ్లగా ఉద్రిక్తత చోటుచేసుకుంది. కాంగ్రెస్‌కు చెందిన మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస రెడ్డి, పట్టణ అధ్యక్షుడు గుమ్మల మోహన్ రెడ్డి సారథ్యంలో కాంగ్రెస్ శ్రేణులు విధ్వంసకాండకు దిగాయి. చేతికి అందిన పూల కుండీలు, కుర్చీలు విసురుతూ బీఆర్ఎస్ నేతలపైకి దూసుకెళ్లి భయభ్రాంతులకు గురిచేశారు. ఓ వైపు కాంగ్రెస్ శ్రేణుల దాడి, మరోవైపు పోలీసుల అరెస్టు ప్రయత్నాలతో కంచర్ల సొమ్మసిల్లి పడిపోయారు. ఈ గందరగోళం మధ్యనే భూపాల్‌రెడ్డిని పోలీసులు అక్కడి నుంచి బలవంతంగా అరెస్టు చేసి తరలించారు. ప్రశాంతంగా కొనసాగుతున్న నిరసనను రణరంగంగా మార్చిన కాంగ్రెస్ నేతల్లో ఏ ఒక్కరినీ అరెస్టు చేయలేదు. బీఆర్ఎస్ నేతలను తరలించిన నాంపల్లి పోలీసుస్టేషన్‌కు తరలించగా జడ్పీ మాజీ చైర్మన్ బండా నరేందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు రమావత్ రవీంద్రకుమార్, చిరుమర్తి లింగయ్య, పైళ్ల శేఖర్‌రెడ్డి భూపాల్‌రెడ్డిని పరామర్శించారు. కాంగ్రెస్ గూండాల దాడిని, పోలీసుల తీరును తీవ్రంగా ఖండించారు. భూపాల్‌రెడ్డి ఇంటికి రాత్రి చేరుకున్న జగదీశ్‌రెడ్డి, మాజీ ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్, ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి, పార్టీ రాష్ట్ర నేతలు కంచర్ల కృష్ణారెడ్డి, చెరుకు సుధాకర్ పరామర్శించారు. బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డితో పాటు ఇతర నేతలపై జరిగిన దాడి గురించి పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరా తీశారు. దాడిని తీవ్రంగా ఖండించారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రజల్లో కాంగ్రెస్ గూండాయిజాన్ని ఎండగడదామని, త్వరలో నల్లగొండలో బ్రహ్మాండంగా రైతు ధర్నా నిర్వహిద్దామని భూపాల్‌రెడ్డికి కేటీఆర్ ఈ సందర్భంగా సూచించినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. తనపై దాడికి ప్రేరేపించిన మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు గుమ్మల మోహన్‌రెడ్డిలపై చర్యలు తీసుకోవాలని భూపాల్ రెడ్డి ఫిర్యాదు చేశారు.

### మరో ముగ్గురిపై కేసు

నీలగిరి, జనవరి 21: నల్లగొండ మున్సిపాలిటీలో జరిగిన దాడి ఘటనలో కంచర్ల భూపాల్‌రెడ్డి, సైదిరెడ్డి, బోనగిరి దేవేందర్‌తోపాటు నాయకుడు మెరుగు గోపీనాథ్‌పై బీఎన్ఎస్ సెక్షన్ 170 ప్రకారం కేసులు నమోదు చేశారు.

# గులాబీ జెండా చూస్తేనే వణుకుతున్నరు

**కోమటిరెడ్డి సోయి లేని ఆదేశాలతోనే అరెస్టులు • కాంగ్రెస్ దాడిపై మండిపడ్డ మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి**

సూర్యాపేట, జనవరి 21 (నమస్తే తెలంగాణ): నల్లగొండ జిల్లాలో పోలీస్, కాంగ్రెస్ గూండాల రాజ్యం నడుస్తున్నదని, త్వరలోనే కాంగ్రెస్ పాపాల పుట్ట పగలడం ఖాయమని మాజీ మంత్రి, సూర్యాపేట శాసనసభ్యుడు జగదీశ్‌రెడ్డి మండిపడ్డారు. మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి సోయి లేకుండా ఇచ్చిన ఆదేశాలతోనే మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి, బీఆర్ఎస్ శ్రేణులను అరెస్టు చేశారని ఆయన ధ్వజమెత్తారు. సూర్యాపేటలో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. పాపం వెంకట్‌రెడ్డికి రోజుకో రకమైన ఫోబియా పట్టుకుంటుందని, ఆ మధ్యన రైతులు, ప్రజలను చూసి, ఇటీవల కేటీఆర్‌ను చూసి ఫోబియాతో వణికిపోతున్నారని ఎద్దేవా చేశారు. రెండు రోజులుగా కేటీఆర్ ఫొటోలు చూసినా, గులాబీ రంగు చూసినా తట్టుకునే పరిస్థితి లేకుండా భయపడి వణుకుడు పట్టుకుంటుందని చెప్పారు. నల్లగొండకు కేటీఆర్ వస్తారని బీఆర్ఎస్ శ్రేణులు, ఆయన అభిమానులు ఫ్లెక్సీలు ఏర్పాటు చేసుకుంటే కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి హుకూంతో మున్సిపల్ అధికారులు రౌడీల్లా చించివేయడం పట్ల జగదీశ్‌రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. 'వాస్తవానికి మున్సిపాలిటీవారు కనీసం నోటీసులు ఇవ్వాలి లేదా సంబంధికులకు చెప్పాలి. అది వారి బాధ్యత. కాదంటే ఫైన్ వేయాలి. అర్ధరాత్రి అధికారులు ఫ్లెక్సీలు చించివేసిన చట్ట విరుద్ధమైన చర్యలపై అడిగేందుకు మాజీ ఎమ్మెల్యే, మాజీ మున్సిపల్ చైర్మన్ వెళ్తే అరెస్టులు చేయడం సిగ్గు చేటు. పోలీసు రాజ్యం అమలు చేస్తామంటే కష్టం అవుతుంది. ఇది నల్లగండ జిల్లా అని గుర్తుంచుకోవాలి. మర్యాద పూర్వకంగా వారికి విజ్ఞప్తి చేస్తున్నా. నల్లగొండ జిల్లా ప్రజల తిరుగుబాటు ఎలా ఉంటుందో ప్రపంచానికి తెలుసు. వెంకట్‌రెడ్డి లాంటివారు చేసిన తప్పుడు పనులు, సోయి లేకుండా ప్రజలపై చేసిన దాడుల వల్లనే నల్లగొండ జిల్లా నుంచి నాడు తిరుగుబాటు మొదలైంది. మళ్లీ అలాంటి తిరుగుబాటు వచ్చే అవకాశం కనిపిస్తున్నది. మున్సిపాలిటీలో బీఆర్ఎస్ నేతలు ఉన్నారని వెంకట్‌రెడ్డి కాంగ్రెస్ గూండాలను ఎగేసి పంపించి కార్యకర్తలపై దాడులకు పురుగొల్పుతున్నారు. ఇరువర్గాలు గొడవ చేస్తే ఇరువర్గాలను అరెస్టు చేయాలి. అసలు కాంగ్రెస్‌కు సంబంధం లేదు. బీఆర్ఎస్, అధికారులు తేల్చుకోవాల్సిన సమస్యలో కాంగ్రెస్ వారికి ఏం పని? ఇటువంటి చిల్లర దాడులు మమ్మల్ని ఆపలేవు. కాంగ్రెస్ నాయకులం మేం తోపులం, ఇంతింత ఎత్తు మంత్రులుగా ఉన్నాం అనుకున్న నాడే బీఆర్ఎస్ ఉద్యమాలు చేసింది. కాంగ్రెస్ నిజస్వరూపం ఒక్కొక్కటిగా భయపడుతుంది. కాంగ్రెస్ రహిత తెలంగాణ కోసం నల్లగొండ నుంచే ఉద్యమం మొదలవుతుంది. కాంగ్రెస్ హఠావో తెలంగాణ బచావో నినాదం మొదలైంది. గుర్తు పెట్టుకోండి. ఇప్పటికైనా మారకపోతే కాంగ్రెస్ మూల్యం చెల్లించక తప్పదు' అని జగదీశ్‌రెడ్డి పేర్కొన్నారు.



మంగళవారం నల్లగొండలో మీడియాతో మాట్లాడుతున్న మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి. చిత్రంలో మాజీ ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్

> "ఫ్లెక్సీలు చించివేయడం వల్ల బీఆర్ఎస్‌కు నష్టం జరిగింది. దాని గురించి అడిగేందుకు బీఆర్ఎస్ నేతలు మున్సిపాలిటీకి వెళ్లారు. మరి కాంగ్రెస్ వారికి అక్కడికి వెళ్లాల్సిన అవసరం ఏంటి? పోలీసు రాజ్యం అమలు చేస్తామంటే కష్టం అవుతుంది. ఇది నల్లగొండ జిల్లా అని గుర్తుంచుకోవాలి. మర్యాద పూర్వకంగా వారికి విజ్ఞప్తి చేస్తున్నా. నల్లగొండ జిల్లా ప్రజల తిరుగుబాటు ఎలా ఉంటుందో ప్రపంచానికి తెలుసు.
> - జగదీశ్‌రెడ్డి

> "వెంకట్‌రెడ్డిని సంతృప్తిపర్చేందుకు సోయిలో లేకుండా ఆయన ఇచ్చిన ఆర్డర్‌ను అమలు చేయడం సరికాదు. జిల్లా అధికారులకు చెబుతున్నా... వెంకట్‌రెడ్డి ఏది పడితే అది ఆర్డర్ ఇస్తే వాటిని అమలు చేస్తే మీరే ఇబ్బందులు పడతారు. వెంకట్‌రెడ్డి మంత్రి కావచ్చు, కానీ, సోయి లేకుండా... ఒరిజినల్‌గా ఉండే స్పృహ లేకుండా ఆయన ఇస్తున్న ఆదేశాలను అమలుచేస్తే ఇబ్బందులు తప్పవు. దయచేసి ఆలోచించి విజ్ఞతతో పనిచేయాలి.
> - జగదీశ్‌రెడ్డి

### గ్రామ సభల్లో బట్టబయలైన ప్రభుత్వ ఫెయిల్యూర్

'రాష్ట్రవ్యాప్తంగా గ్రామ సభలు ఏర్పాటు చేసి లబ్ధిదారులను ఎంపిక చేసే ప్రక్రియను ప్రారంభించిన తొలి రోజే ప్రజల నిరసనలతో ప్రభుత్వ ఫెయిల్యూర్ బయటపడింది. కాంగ్రెస్ పార్టీ అంటేనే పైరవీలు, మోసాలు. అర్హులైనవారికి ఒక శాతమైనా లబ్ధి చేకూర్చకపోవడంతోనే ప్రజలు పెద్ద ఎత్తున గ్రామ సభలకు వచ్చి అధికారులను నిలదీశారు' అని జగదీశ్‌రెడ్డి చెప్పారు. రెండుసార్లు ప్రజల నుంచి దరఖాస్తులు తీసుకొని బుట్టదాఖలు చేశారని, తీరా నేడు కాంగ్రెస్ నాయకులు చెప్పినట్లుగా లబ్ధిదారులను ఎంపిక చేస్తున్నారని దుయ్యబట్టారు. గ్రామీణ పేదల తిరుగుబాటు ఆగ్రహజ్వాలల్లో కాంగ్రెస్ బూడిదకావడం ఖాయమన్నారు. తమను మోసం చేసి అధికారంలోకి వచ్చారని ప్రజలు గుర్తించారని, కాంగ్రెస్ మోసాలపై తిరుగుబాటు తప్పదని హెచ్చరించారు.

# ఫోర్త్‌సిటీకి భూములు ఇచ్చేదే లేదు

- **గ్రామసభలో గళమెత్తిన లేమూరు రైతులు**
- **బాధితులతో కాంగ్రెస్ నేతల వాగ్వాదం**
- **న్యాయం కోసం అన్నదాతల డిమాండ్**
- **సమావేశం వాయిదా వేసిన అధికారులు**

కందుకూరు, జనవరి 21 : రంగారెడ్డి జిల్లా కందుకూరు మండల పరిధిలోని బేగరికంచ సమీపంలో ఏర్పాటుచేస్తున్న ఫోర్త్‌సిటీ రోడ్డుకు భూములు ఇచ్చేది లేదని రైతులు తెగేసి చెప్పారు. దీంతో రైతులతో కాంగ్రెస్ పార్టీ నాయకులు గొడవకు దిగారు. 10 శాతం రైతుల భూములు పోతే 90 శాతం మందికి న్యాయం జరుగుతుందని కాంగ్రెస్ నాయకులు వితండవాదానికి దిగారు. దీంతో బాధిత రైతులు.. తమకు న్యాయం చేయాలంటూ నినదించారు. ఈ ఘటన మంగళవారం కందుకూరు మండల పరిధిలోని లేమూరు గ్రామ పంచాయతీ కార్యాలయంలో డిప్యూటీ కలెక్టర్ రాజు బాధిత రైతులతో సమావేశం ఏర్పాటుచేశారు. ఈ క్రమంలో బాధిత రైతులు, కాంగ్రెస్ నాయకుల మధ్య వాగ్వాదం చోటుచేసుకున్నది. కొంతమంది రైతులను ఉద్దేశించి.. మీకేం పని ఇక్కడ అంటూ నాయకులు గొడవ సృష్టించారు. దీంతో మా భూములు పోతుంటే మేం ఊరుకుంటామా? మా భూములు మా ఇష్టం.. మీకేంటని రైతులు ప్రశ్నించారు. పోలీసులు జోక్యం చేసుకొని కాంగ్రెస్ నాయకులను అక్కడి నుంచి పంపించారు. డిప్యూటీ కలెక్టర్ సమావేశాన్ని వాయిదావేసి వెళ్లిపోయారు. అనంతరం రైతులు మాట్లాడుతూ.. మాకు న్యాయం జరిగే వరకు పోరాటం చేస్తామని తెగేసి చెప్పారు. మా భూములను ఎట్టిపరిస్థితిలో ఇచ్చేది లేదని స్పష్టంచేశారు. రైతులతో కాంగ్రెస్ నాయకుల వాగ్వాదంపై పలువురు విచారం వ్యక్తంచేశారు.



రంగారెడ్డి జిల్లా కందుకూరు మండలం లేమూరులో రైతులను బెదిరిస్తున్న కాంగ్రెస్ నాయకులు

## ఎమ్మెల్సీ కవితపై దుష్ప్రచారం

**ఫొటో మార్ఫింగ్‌తో ట్రోలింగ్**

**కారకులపై కఠిన చర్యలు తీసుకోవాలి**

**మహిళా కమిషన్‌కు జాగృతి ఫిర్యాదు**

హైదరాబాద్, జనవరి 21 (నమస్తే తెలంగాణ): జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితపై సోషల్ మీడియాలో దుష్ప్రచారం జరుగుతున్నదని, దీనికి కారణమైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని మహిళా సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. 'అరవింద్ అన్న ఆర్మీ' ఐడీ పేరుతో గత రెండు రోజులుగా ఈ దుష్ప్రచారం జరుగుతున్నదని, ఎమ్మెల్సీ కవిత ఫొటో మార్ఫింగ్‌తో ట్రోలింగ్ చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశాయి. కవిత ప్రతిష్ఠకు భంగం కలిగేలా పోస్టులు ఉన్నాయని మండిపడ్డాయి. మంగళవారం జాగృతి రాష్ట్ర నాయకురాలు కవిత మేరు ఆధ్వర్యంలోని బృందం మహిళా కమిషన్ చైర్మన్ శారదను కలిసి ఫిర్యాదు చేసింది. మహిళా కమిషన్‌ను కలిసిన వారిలో కట్ట అనూష, మురారి స్మిత కోటేశ్‌గౌడ్, విజయ, శైలజ తదితరులు ఉన్నారు.

# ఈవీ ముసుగులో ఆర్టీసీపై వేటు?

- **ప్రైవేట్ కంపెనీలకు సబ్సిడీల ధారాదత్తం**
- **ప్రభుత్వం నిర్ణయాన్ని వెనక్కితీసుకోవాలి**
- **సర్కార్, యాజమాన్యంపై సంఘాల ఫైర్**
- **27న సమ్మె నోటీస్ ఇస్తాం: ఆర్టీసీ జాక్**
- **24, 25న నిరసనలు: ఎస్‌డబ్ల్యూయూ, ఎస్‌డబ్ల్యూఎఫ్**



హైదరాబాద్, జనవరి 21 (నమస్తేతెలంగాణ): టీజీఎస్ ఆర్టీసీలో సమ్మె సైరన్ మోగింది. ఈ మేరకు కార్మిక సంఘాలు సిద్ధమవుతున్నాయి. ఆర్టీసీ యాజమాన్యం తీరుపై, ప్రభుత్వ వైఖరిపై తాడోపేడో తేల్చుకోవాలని ఆర్టీసీ కార్మిక సంఘాల జేఏసీ తాజాగా నిర్ణయించింది. ఎలక్ట్రిక్ బస్సుల మాటున ప్రైవేటీకరణ అంశం దాగి ఉన్నదని జేఏసీ నేతలు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. ఆర్టీసీ యాజమాన్యం ఎలక్ట్రిక్ బస్సులను ప్రైవేటు కంపెనీలకు కట్టబెట్టడాన్ని నిరసిస్తూ సమ్మె నోటీసు ఇవ్వాలని నిర్ణయించినట్టు జేఏసీ ప్రతినిధులు ఈ వెంకన్న, థామస్‌రెడ్డి, ఎండీ మౌలానా, కత్తుల యాదయ్య, సురేశ్, యాదయ్య మంగళవారం వెల్లడించారు. హైదరాబాద్‌లోని జేఏసీ కార్యాలయంలో ఆర్టీసీ కార్మిక సంఘాలైన టీఎంయూ, ఈయూ, ఎన్ఎంయూ, బీకేయూ, బీడబ్ల్యూయూ, కార్మిక పరిషత్ ప్రతినిధులు సమావేశమై ఈ కీలక నిర్ణయం తీసుకున్నారు. ఈ నెల 27న రాష్ట్రవ్యాప్తంగా కార్మికులను కూడగట్టి ఆర్టీసీ యాజమాన్యానికి, ప్రభుత్వానికి సమ్మె నోటీస్ ఇస్తామని వారు ప్రకటించారు. గతంలో కేవలం ఏసీ బస్సులకే పరిమితమైన విద్యుత్తు బస్సులు.. ఇప్పుడు నాన్ ఏసీ బస్సులను సరఫరా చేస్తూ, వాటిని సూపర్ లగ్జరీ, డీలక్స్, సెమీ డీలక్స్, ఎక్స్‌ప్రెస్ క్యాటగిరీల్లో తిప్పుతున్నారని విమర్శించారు. ఎలక్ట్రిక్ బస్సులతో బస్ డిపోలను జేబీఎం సంస్థకే అప్పగించేందుకు ఆర్టీసీ యాజమాన్యం ప్రయత్నిస్తున్నదని జేఏసీ ప్రతినిధులు ఆగ్రహం వ్యక్తంచేశారు.

### ఆర్టీసీలో నియామకాలు లేనట్టేనా?

ఆర్టీసీలో దాదాపు 7,000 పోస్టులు ఖాళీగా ఉన్నాయని, వీటి భర్తీ కోసం గతంలో ప్రక్రియ ప్రారంభించినా నిలిచిపోయిందని ఆర్టీసీ జేఏసీ ప్రతినిధులు తెలిపారు. ఆర్టీసీలోకి అద్దె బస్సులు భారీగా వస్తుండటంతో వాటి నిర్వహణకు ప్రైవేట్ సంస్థల సిబ్బందినే నియమిస్తుండటంతో ఆర్టీసీలో ఇకపై నియామకాలు ఉండకపోవచ్చని వారు ఆందోళన వ్యక్తంచేశారు.

### 24, 25 తేదీల్లో నల్లబ్యాడ్జీలతో నిరసనలు

ఎలక్ట్రిక్ బస్సులకు వ్యతిరేకంగా ఎస్‌డబ్ల్యూయూ, ఎస్‌డబ్ల్యూఎఫ్ ఆధ్వర్యంలో ఈ నెల 24, 25 తేదీల్లో నల్లబ్యాడ్జీలతో నిరసన కార్యక్రమాలు చేపట్టాలని నిర్ణయించినట్టు తెలిపారు.

# ఆర్టీసీ ప్రైవేటీకరణకు సర్కార్ కుట్ర

- **రహస్య ఎజెండాతో నిర్వీర్యానికి కుట్ర**
- **ప్రైవేటు సంస్థకు డిపోల అప్పగింత?**
- **ఇప్పటికే జేబీఎంకు వరంగల్ డిపో**
- **నియామకాల్లేవు.. కొత్త బస్సులు రావు**
- **కార్మిక సంఘాలతో కలిసి ఉద్యమిస్తాం**
- **బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి పువ్వాడ**
- **ఆర్టీసీ స్థలాలు అమ్మే యత్నం: సుభాశ్‌రెడ్డి**



తెలంగాణభవన్‌లో మీడియాతో మాట్లాడుతున్న మాజీ మంత్రి పువ్వాడ. చిత్రంలో ఎమ్మెల్సీ సుభాశ్‌రెడ్డి

హైదరాబాద్, జనవరి 21 (నమస్తే తెలంగాణ): టీజీఎస్ ఆర్టీసీ ప్రైవేటీకరణకు రాష్ట్రంలోని కాంగ్రెస్ సర్కారు రహస్య ఎజెండాతో ముందుకు వెళ్తున్నదని బీఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ విమర్శించారు. తెలంగాణ భవన్‌లో మంగళవారం ఎమ్మెల్సీ శేరి సుభాశ్‌రెడ్డి, రాష్ట్ర కార్పొరేషన్ మాజీ చైర్మన్ చిరుమిళ్ల రాకేశ్‌తో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. ఆర్టీసీ పాత బస్సుల స్థానంలో ప్రైవేట్ ఎలక్ట్రిక్ బస్సులను తెచ్చి డిపోలను ప్రైవేకరిస్తున్నదని మండిపడ్డారు. 100 రోజుల్లోనే విలీనం చేస్తామని హామీ ఇచ్చి 400 రోజులైనా కాంగ్రెస్ సర్కార్ పట్టించుకోవడం లేదని ధ్వజమెత్తారు. నూతన నియామకాలు చేపట్టకుండా, కొత్త బస్సులను కొనకుండా ఆర్టీసీ నిర్వీర్యానికి కుట్ర చేస్తున్నదని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఎలక్ట్రిక్ బస్సులను అద్దెకు ఇస్తున్న ఢిల్లీ జేబీఎం అనే ప్రైవేటు సంస్థకు వరంగల్, హైదరాబాద్-1 డిపోలను అప్పగించారని, డిపోలో పనిచేస్తున్న సిబ్బందిని ఇతర డిపోలకు పంపిస్తున్నారని విమర్శించారు. త్వరలోనే కరీంనగర్, నిజామాబాద్, నల్లగొండ, సూర్యాపేటతోపాటు మరికొన్ని డిపోలను కూడా జేబీఎంకు అప్పగించేలా ప్లాన్ చేస్తున్నారని తెలిపారు.

### బీఆర్ఎస్ హయాంలో 1,150 కొత్త బస్సులు

బీఆర్ఎస్ హయాంలో రెండు విడతలుగా కొనుగోలు చేసిన 500 ఒలెక్ట్రా ఎలక్ట్రిక్ బస్సులను (ఏసీ, నాన్ ఏసీ) ఎయిర్‌పోర్టుతోపాటు వివిధ జిల్లాలకు నడిపించామని వివరించారు. 650 డీజిల్ బస్సులను ఆర్టీసీ కొనుగోలు చేసిందని, లగ్జరీ, సెమీ లగ్జరీ బస్సు సర్వీసులుగా నడిపించామని గుర్తుచేశారు. ఆనాడు ఆర్టీసీ నష్టాలను నివారించగలిగామని గుర్తుచేశారు. అధికారంలోకి వచ్చాక ఒక్క బస్సుకు ఆర్డర్ ఇవ్వని రేవంత్‌రెడ్డి సర్కారు.. తమ హయాంలో కొనుగోలు చేసిన బస్సులకు జెండాలు ఊపి ప్రారంభించారని తెలిపారు. ప్రైవేటీకరణ కోసమే నియామకాలు చేపట్టడం లేదని తెలిపారు. ఈ దశలో ఆర్టీసీ పరిరక్షణకు కార్మిక సంఘాలతో కలిసి బీఆర్ఎస్ పోరాడుతుందని స్పష్టం చేశారు. ఏడాదిగా ఆర్టీసీని కాంగ్రెస్ ప్రభుత్వం నిర్వీర్యం చేసిందని మండిపడ్డారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంతో ఆర్టీసీకి ఎలా లాభాలు వచ్చాయో ప్రభుత్వం చెప్పడమే లేదని విమర్శించారు.

### ఆర్టీసీ ఆస్తులను అమ్మేందుకే: శేరి సుభాశ్‌రెడ్డి

రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో ఉన్న విలువైన ఆర్టీసీ స్థలాలను అమ్మేసేందుకే కాంగ్రెస్ ప్రభుత్వం ప్రైవేటీకరణ బాట పట్టిందని ఎమ్మెల్సీ శేరి సుభాశ్ రెడ్డి విమర్శించారు. ఒక్క ఆర్టీసీ బస్సుకు ఆరుగురు సిబ్బంది ఉంటారని, ఎలక్ట్రిక్ బస్సులను అద్దెకు తీసుకోవడం వల్ల ఒక్క కండక్టర్ మాత్రమే సంస్థ కింద పరిగణించాలని చూస్తున్నారని మండిపడ్డారు. ప్రైవేటు బస్సుల వల్ల ఉద్యోగుల భద్రతకు ముప్పు వాటిల్లే ప్రమాదమున్నదని మండిపడ్డారు.

# పద్మారావుగౌడ్‌కు గుండెపోటు

- అత్యవసర చికిత్స అందించిన వైద్యులు
- ఆరోగ్యం నిలకడగా ఉన్నదన్న వైద్యులు
- ఫోన్‌లో పరామర్శించిన కేసీఆర్, కేటీఆర్
- ఎవరూ ఆందోళన చెందొద్దు: పద్మారావు



సికింద్రాబాద్, జనవరి21: బీఆర్ఎస్ సీనియర్ నేత, సికింద్రాబాద్ ఎమ్మెల్యే తిగుళ్ల పద్మారావుగౌడ్‌కు గుండెపోటు వచ్చింది. అత్యవసర చికిత్స అందించడంతో ఆయన ప్రాణాపాయం నుంచి బయటపడ్డారు. డెహ్రాడూన్ టూర్‌లో ఉన్న పద్మారావుగౌడ్‌కు అకస్మాత్తుగా ఛాతీలో నొప్పి వచ్చింది. వెంటనే ఉన్న కుటుంబసభ్యులు స్థానిక దవాఖానలో చేర్పించారు. అక్కడి డాక్టర్లు వైద్యపరీక్షలు నిర్వహించి, అత్యవసరంగా స్టంట్‌వేసి ప్రాణాపాయం లేదని నిర్ధారించారని కుటుంబ సభ్యులు తెలిపారు. పద్మారావుగౌడ్‌కు గుండెపోటు వచ్చిందన్న సమాచారంతో సికింద్రాబాద్ ప్రజల్లో ఆందోళన నెలకొన్నది. పలువురు నేతలు హుటాహుటిన డెహ్రాడూన్‌కు బయలుదేరి వెళ్లారు. పద్మారావును కలిసి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. స్టంట్ వేసిన తర్వాత ఆయన ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉన్నట్టు డాక్టర్లు తెలిపారు. ఆయన కొన్నిరోజులు విశ్రాంతి తీసుకోవాలని సూచించారు.

### ఆరోగ్యంగానే ఉన్నా ఆందోళన వద్దు: ఎమ్మెల్యే పద్మారావు

తాను సంపూర్ణ ఆరోగ్యంగా ఉన్నానని, అభిమానులు, కార్యకర్తలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని సికింద్రాబాద్ ఎమ్మెల్యే, మాజీ డిప్యూటీ స్పీకర్ తిగుళ్ల పద్మారావుగౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు. తాను పూర్తిగా కోలుకున్నానని, ఆరోగ్యంగానే ఉన్నానని పద్మారావుగౌడ్ పేర్కొన్నారు.

### పద్మారావుకు కేసీఆర్, కేటీఆర్ పరామర్శ

డెహ్రాడూన్ పర్యటనలో అస్వస్థతకు గురై, వైద్యచికిత్స అనంతరం హైదరాబాద్ చేరుకున్న ఎమ్మెల్యే పద్మారావు గౌడ్‌ను బీఆర్ఎస్ పార్టీ అధినేత కేసీఆర్, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పరామర్శించారు. ఫోన్‌తో స్వయంగా ఆయనతో మాట్లాడి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. వైద్యుల సూచన మేరకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. చికిత్స అనంతరం తాను ఆరోగ్యంగానే ఉన్నానని పద్మారావుగౌడ్ వారికి తెలిపారు.

# నేడు 'బీఆర్ఎస్ అధ్యయన కమిటీ' సమావేశం

కమిటీ చైర్మన్ నిరంజన్‌రెడ్డి నివాసంలో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌తో భేటీ

హైదరాబాద్, జనవరి 21 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో అన్నదాతల ఆత్మహత్యలపై ఏర్పాటైన బీఆర్ఎస్ అధ్యయన కమిటీ తొలిసారి బుధవారం భేటీ కానున్నది. హైదరాబాద్ శివారులోని మంచిరేవులలో కమిటీ చైర్మన్, మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి నివాసంలో మధ్యాహ్నం ఈ సమావేశం జరుగనున్నది. సమావేశానికి పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌తోపాటు కమిటీలోని సభ్యులు సత్యవతి రాథోడ్, జోగు రామన్న, పువ్వాడ అజయ్‌కుమార్, ఎంసీ కోటిరెడ్డి, యాదవరెడ్డి, బాజిరెడ్డి గోవర్ధన్, రసమయి బాలకిషన్, అంజయ్యయాదవ్ హాజరుకానున్నారు. రాష్ట్రంలో వరుసగా జరిగే రైతు ఆత్మహత్యలు, క్షేత్రస్థాయిలో నెలకొన్న వ్యవసాయ సంక్షోభ పరిస్థితులు, తీసుకోవాల్సిన నివారణ చర్యలు, ప్రభుత్వానికి చేయాల్సిన సూచనలపై సమావేశంలో చర్చించనున్నారు.

### యాదవరెడ్డికి చోటు..



రాష్ట్రంలో అన్నదాతల ఆత్మహత్యలపై ఏర్పాటైన బీఆర్ఎస్ అధ్యయన కమిటీలో వరంగల్ జిల్లాకు చెందిన కుడా మాజీ చైర్మన్ మర్రి యాదవరెడ్డికి చోటు కల్పించారు. దీనిపై ఉమ్మడి వరంగల్ జిల్లా బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు హర్షం వ్యక్తంచేశారు.

# యూరియా కోసం పీఏసీఎస్ ఎదుట ధర్నా

బోనకల్లు, జనవరి 21 : రైతులకు అందించాల్సిన యూరియాను సొసైటీ చైర్మన్, సీఈవో కుమ్మక్కై అక్రమంగా ఇతర ప్రాంతాలకు తరలించి అమ్ముకుంటున్నారని ఆరోపిస్తూ ఖమ్మం జిల్లా బోనకల్లు మండలం ఆళ్లపాడు కాంగ్రెస్ పార్టీకి చెందిన సొసైటీ డైరెక్టర్లు, రైతులు రావినూతల పీఏసీఎస్ ఎదుట మంగళవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సొసైటీ డైరెక్టర్లు తోటకూర వెంకటేశ్వరరావు, సెనకేసి వెంకయ్య, వెంకటరావు, కాంగ్రెస్ నాయకులు పారా వెంకటమోహన్‌రావు, మంద రామారావు మాట్లాడుతూ నాలుగు రోజులుగా యూరియా కోసం కార్యాలయం చుట్టూ తిరుగుతున్నామని వాపోయారు.